సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం : 6 : జనవరి : 2023



సింహగిరిపై
నృసింహ దీక్షల విరమణ 8లో



జాతీయ పవర్ లిఫ్టింగ్
పోటీలు ప్రారంభం 8లో



ప్లాట్‌ఫాం ఎత్తు
పెంపు పరిశీలిస్తాం 8లో

న్యూస్‌రీల్

ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్‌రెడ్డి



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర జిల్లాల 'జగనన్న సచివాలయం కన్వీనర్స్, గృహ సారథి' (జేసీఎస్) కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్ రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉత్తరాంధ్ర జిల్లాల జేసీఎస్ పరిధిలోని విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 35 అసెంబ్లీ కోఆర్డినేటర్లు, 9,567 సచివాలయ కన్వీనర్లు, 1,07,916 గృహ సారథులు ఉంటారు.

నేడు స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం శుక్రవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు జీవీఎంసీ కార్యదర్శి పి.నల్లనయ్య తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి నిర్వహించనున్న సమావేశంలో 23 అంశాలు సభ్యుల ఆమోదానికి రానున్నాయని చెప్పారు.

నేడు ఏఎంసీలో హాస్టల్ భవనాలకు శంకుస్థాపన

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఆంధ్రా మెడికల్ కాలేజీలో హాస్టల్ భవనాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని శుక్రవారం శంకుస్థాపన చేస్తారు. రూ.73 కోట్లతో విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా హాస్టళ్లు నిర్మిస్తారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొంటారని ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తెలిపారు.

రేపు జూనియర్ సివిల్ జడ్జి స్క్రీనింగ్ పరీక్ష

విశాఖ లీగల్: జూనియర్ సివిల్ జడ్జి ఎంపికకు ఈ నెల 7న జరిగే స్క్రీనింగ్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌లో సూచించిన విధంగా గుర్తింపు కార్డులు తీసుకురావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.గోపి సూచించారు. పరీక్ష ప్రారంభ సమయానికి 15 నిమిషాల ముందే కేంద్రానికి చేరుకోవాలన్నారు. కేంద్రం గేట్లు వేసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ అభ్యర్థులను లోపలకు అనుమతించమని ఓ ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం(విశాఖ ఉత్తర): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంచరపాలెం ఐటీఐలోని నైపుణ్యాభివృద్ధి కార్యాలయంలో స్కిల్ హబ్ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు హబ్ కో–ఆర్డినేటర్ మౌనిక ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసున్న ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి పాత ఐటీఐలో శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు 99087 99126 నంబర్ ద్వారా ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నేడు ఉద్యోగ మేళా

ఎంవీపీ కాలనీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన మిషన్(సీడాప్), డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు. కంచరపాలెంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం వేదికగా జరగనున్న ఈ మేళాలో 10 సంస్థలు పాల్గొని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. స్మైలెక్స్ లేబొరేటరీస్, డెక్కన్ కెమికల్స్, టెక్విన్స్ సాఫ్ట్‌వేర్, నోవల్ పేటెంట్ సర్వీస్, గ్రాపెక్స్, హెల్ప్ యువర్ నీడ్స్, గ్రీన్‌పార్కు హోటల్, అడికో, పేటియం సర్వీస్‌లలో ఉద్యోగాల భర్తీకి ఈ మేళా నిర్వహించనున్నారు. అభ్యర్థులు తగిన సర్టిఫికెట్లతో ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని, పూర్తి వివరాలకు 73867 13880 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

యోగా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: యోగా పీజీ డిప్లమా, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు తెలిపారు. రుషికొండ యోగా–వెల్‌నెస్ సెంటర్‌లో పీజీ డిప్లమా యోగాలో 50, డిప్లమాలో 80 సీట్లు, ఎంవీపీ కాలనీలోని పతంజలి యోగా కేంద్రంలో డిప్లమా ఇన్ యోగాలో 80 సీట్లు, విజయనగరం జిల్లా బొబ్బిలి శ్రీ యోగ విద్య సంస్థాన్‌లో డిప్లమా ఇన్ యోగాలో 60 సీట్లు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 0891 2573441 నంబరులో సంప్రదించాలన్నారు.

కన్నీటి వీడ్కోలు

తమకు వెన్నుదన్నుగా నిలిచిన మహావృక్షం కూలిపోయిందని పాడి రైతులు కుమిలిపోయారు.. ప్రగతి బాటలు పరిచిన మహనీయుడి
నిష్క్రమణతో పల్లెలు తల్లడిల్లాయి.. ఆ పెద్దాయన వల్ల అనేక విధాలుగా లబ్ధి పొందిన వేలాదిమంది కన్నీరుమున్నీరయ్యారు.. పూల మాలలతో నివాళులర్పించారు.. తమ పెరటిలో 'తులసి' మొక్కవై మొలకెత్తాలని అశ్రునయనాలతో కడసారి ప్రార్థించారు.



భారీ సంఖ్యలో అభిమానులు వెంటరాగా తులసీరావు అంతిమయాత్ర

- అశ్రునయనాలతో తులసీరావు అంతిమయాత్ర
- పోటెత్తిన అభిమానులు, రైతులు, నేతలు
- స్వచ్ఛంద బంద్ పాటించిన వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు

అనకాపల్లి రూరల్/యలమంచిలి/మునగపాక: అసమాన 'పాల'నా దక్షతతో విశాఖ డెయిరీని ఆకాశమంత ఎత్తుకు తీసుకువెళ్లిన ఆడారి తులసీరావు ఇక లేరన్న నిజాన్ని జీర్ణించుకోలేక అభిమానులు ఆవేదన చెందారు. మనసులోని ఉద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచిన తులసీరావు పార్థివ దేహం గురువారం ఉదయం విశాఖ చేరుకుంది. తొలుత గాజువాకలోని డెయిరీ ప్రధాన కార్యాలయంలో భౌతిక కాయాన్ని కాసేపు ఉంచి, ఉద్యోగులు, స్థానికులు నివాళులర్పించిన తర్వాత యలమంచిలి తరలించారు. నేరుగా పాత సినిమాహాలు మైదానం వద్ద పార్థివ దేహాన్ని ఉంచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించిన అనంతరం తులసీనగర్‌లో వున్న ఆడారి నివాసానికి పార్థివ దేహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లారు. సాయంత్రం కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు, రైతులు, పలు పార్టీలకు చెందిన నాయకులు వెంటరాగా అశ్రునయనాలతో తులసీరావు అంతిమయాత్ర సాగింది. పురవీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. భజనలు, తప్పెటగుళ్లు, అనేక వాద్యాల నడుమ ఆయన అభిమానులు జోహార్ తులసీరావు అంటూ నినదించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తులసీరావు సొంత వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు జరిగాయి. పార్టీలకతీతంగా టీడీపీ, జనసేన, రైతు, ప్రజా సంఘాల నాయకులంతా తరలివచ్చారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు తులసీరావు పాడె మోసి తన అభిమానాన్ని చాటుకున్నారు.

లౌడ్‌స్పీకర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్ల ఏర్పాటు

సీఎం సహా అనేక మంది మంత్రులు, ఎమ్మెల్యేలు ఆడారి తులసీరావు భౌతికకాయాన్ని సందర్శించేందుకు రావడంతో సామాన్యులు కూడా తిలకించేలా తులసీరావు కుటుంబసభ్యులు విస్తృత ఏర్పాట్లు చేశారు. పట్టణంలో పలుచోట్ల లౌడ్ స్పీకర్లు, ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి లైవ్ టెలికాస్ట్ చేశారు. పట్టణంలోని వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలను సంతాప సూచకంగా స్వచ్ఛందంగా మూసివేశారు.

నివాళులర్పించిన ఇతర ప్రముఖులు

తులసీరావు పార్థివ దేహాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొల్ల బాబూరావు, రమణమూర్తి రాజు, పెట్ల ఉమాశంకర్ గణేష్, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, మాజీ మంత్రులు దాడి వీరభద్రరావు, బండారు సత్యనారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి, విశాఖ జిల్లాల అధ్యక్షులు కరణం ధర్మశ్రీ, పంచకర్ల రమేష్‌బాబు, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ తదితరులు నివాళులర్పించారు.



తులసీరావు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్, పక్కన ఆనంద్‌కుమార్, మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యేలు కన్నబాబు, అదీప్‌రాజు



తులసీరావు పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల



ఆడారి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి మంత్రి విడదల రజని

డెయిరీ ప్రాంగణంలో విషాద వదనాలు



డెయిరీ ప్రాంగణంలో వేచి ఉన్న సిబ్బంది, అభిమానులు

అక్కిరెడ్డిపాలెం: ఆంధ్రా కురియన్ ఆడారి తులసీరావును కడసారి చూసేందుకు విశాఖ డెయిరీ డైరెక్టర్లు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, రాజకీయ ప్రముఖులు, ఆయన బంధువులతో విశాఖ డెయిరీ ప్రాంగణం జనసంద్రమైంది. గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో ఆయన పార్థివదేహాన్ని తీసుకొచ్చి డెయిరీ ప్రాంగణంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. బోరున విలపిస్తూ.. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. తులసీరావు కుమారుడు విశాఖ డెయిరీ వైస్ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్, కుమార్తె రమాకుమారి, కిమ్స్ ఐకాన్ ఎండీ పి.సతీష్‌కుమార్ విషణ్ణ వదనాలతో కనిపించారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, పలువురు మాజీ ఎమ్మెల్యేలు, చైర్మన్లు, డైరెక్టర్లు ఆయనకు నివాళులర్పించారు. అనంతరం ఆయన భౌతిక కాయాన్ని యలమంచిలి తరలించారు.

నాన్న ఆశయం నెరవేర్చాలి..

- కుటుంబ సభ్యులకు సీఎం జగన్ ఓదార్పు
- డెయిరీ దిగ్గజం తులసీరావుకు ఘన నివాళి



ఆడారి ఆనంద్‌కుమార్, పిల్లా రమాకుమారిలకు ధైర్యం చెబుతున్న సీఎం జగన్

సాక్షి, అనకాపల్లి/గోపాలపట్నం: అధైర్యపడొద్దు ఆనంద్ అన్నా.. రమాకుమారి తల్లీ అంటూ ఓదార్చారు. నేనున్నానంటూ తులసీరావు సతీమణి జయమ్మకు చేతిలో చెయ్యి వేసి ధైర్యం చెప్పారు. 'వేలాదిమంది పాడి రైతుల యోగక్షేమాలు నాన్న నీకు అప్పగించారు.. ఆయన ఆశయం నెరవేర్చాల'ని ఆనంద్‌కుమార్‌కు హితబోధ చేశారు. అనారోగ్యంతో కన్నుమూసిన డెయిరీ దిగ్గజం, ఆంధ్రా కురియన్ ఆడారి తులసీరావుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చి, అక్కడి నుంచి మధ్యాహ్నం 12.25 గంటలకు సీఎం హెలికాప్టర్లో యలమంచిలి చేరుకున్నారు. పాత సినిమాహాలు మైదానంలో ఉంచిన తులసీరావు పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి, ముకుళిత హస్తాలతో నమస్కరించారు. 20 నిమిషాలసేపు అక్కడ గడిపిన సీఎం తులసీరావు కుమారుడు, వైఎస్సార్‌సీపీ విశాఖ వెస్ట్ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్, కుమార్తె, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. తులసీరావు సేవలను గుర్తుచేసుకున్నారు.

ముఖ్యమంత్రికి ఘనస్వాగతం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఉదయం 11.44 గంటలకు ప్రత్యేక విమానంలో విశాఖ వచ్చారు. విమానాశ్రయంలో ఆయనకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, గొడ్డేటి మాధవి, కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ స్వాగతం పలికారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి వచ్చారు. మధ్యాహ్నం 12.02 గంటలకు ఇక్కడ నుంచి హెలికాప్టర్‌లో యలమంచిలి బయలుదేరి వెళ్లారు. తిరిగి యలమంచిలి నుంచి 12.52 గంటలకు హెలికాప్టర్‌లో విమానాశ్రయానికి చేరుకుని 1.08 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఆయన వెంట మంత్రి బొత్స సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఉన్నారు.

కూర్మన్నపాలెంలో గజం రూ.71 వేలు

- వీఎంఆర్‌డీఏ ఈ వేలానికి విశేష స్పందన
- 46 ప్లాట్లు అమ్మకాలకు పెట్టగా.. 23 ప్లాట్లు విక్రయాలు
- వీటి ద్వారా సంస్థకు రూ.23.13 కోట్లు ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర

దొండపర్తి(విశాఖ దక్షిణ): ప్లాట్ల ఈ–వేలం వీఎంఆర్‌డీఏకు కోట్లు కురిపించింది. కూర్మన్నపాలెంలో గజం ధర అత్యధికంగా రూ.71 వేలుకు వెళ్లింది. వీఎంఆర్‌డీఏ గతంలో అభివృద్ధి చేసిన లేఅవుట్లలో మిగిలి ఉన్న ప్లాట్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన వేలానికి విశేష స్పందన లభించింది. మొత్తం 46 ప్లాట్లు అమ్మకాలకు పెట్టగా.. అందులో 23 ప్లాట్ల విక్రయాల ద్వారా సంస్థకు రూ.23.13 కోట్లు ఆదాయం సమకూరింది. ఈ–వేలం వివరాలను గురువారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో సంస్థ జాయింట్ కమిషనర్ వి.రవీంద్ర వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. కూర్మన్నపాలెం, పెదగంట్యాడ, మద్రిపాలెం, మాధవధార, మధురవాడ సైబర్ వ్యాలీ, డాక్టర్ పద్మావతి జాయింట్ వెంచర్ లేఅవుట్లలో ఎల్‌ఐజీ, ఎంఐజీ, హెచ్‌ఐజీ కేటగిరీ కింద 46 మిగులు ప్లాట్లకు ఈ నెల 3, 4 తేదీల్లో ఈ–వేలం ద్వారా విక్రయాలు చేపట్టారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేసేందుకు నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో పోటీ పడ్డారు. అధికారులు నిర్ణయించిన అప్‌సెట్ ధరకు రెట్టింపు మొత్తంలో ప్లాట్లను కొనుగోలు చేశారు.

కూర్మన్నపాలెం ప్లాట్లకు అత్యధిక ధర

ఈ వేలంలో 46 ప్లాట్లకు విక్రయాలు చేపట్టగా అందులో 23 ప్లాట్లు అమ్ముడయ్యాయి. 3వ తేదీన జరిగిన వేలంలో 14 ప్లాట్లు, 4వ తేదీన నిర్వహించిన వేలంలో 9 ప్లాట్లు అమ్మకాలు జరిగాయి. వీటిలోను కూర్మన్నపాలెం, మాధవధార, మధురవాడ ప్రాంతాల్లో ఉన్న లేఔట్లలో ప్లాట్లను దక్కించుకోడానికి కొనుగోలుదారులు ఆసక్తి చూపించారు. ప్రధానంగా కూర్మన్నపాలెం ఫేజ్–6లో ఎంఐజీ–191 ప్లాట్‌లో గజంకు రూ.35 వేలు అప్‌సెట్ ధరగా నిర్ణయించగా.. అత్యధికంగా రూ.71 వేలుకు కొనుగోలు చేశారు. దీంతో 271.67 గజాలను రూ.1,92,88,570 పలికింది. అలాగే ఇదే ఫేజ్‌లో 192 ప్లాట్‌కు గజం రూ.70,700కు వెళ్లింది. అదే విధంగా మాధవధార లే అవుట్‌లో గజం రూ.68 వేలు, మధురవాడ సైబర్ వ్యాలీలో గజం రూ.60,900కు వెళ్లింది. అత్యల్పంగా డాక్టర్ పద్మావతి జాయింట్ వెంచర్ లేఅవుట్‌లో అప్‌సెట్ ధర గజం రూ.14 వేలు పెట్టగా.. కేవలం రూ.14900లకు కొనుగోలు చేశారు.

7న దాకమర్రి ఎల్‌ఐజీ ప్లాట్లకు లాటరీ

దాకమర్రిలో ఎల్‌ఐజీ ప్లాట్లను ఈ నెల 7వ తేదీన వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో లాటరీ పద్ధతిలో కేటాయించనున్నట్లు సంస్థ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు. ముందుగా రిజర్వ్ కేటగిరీలో వారికి లాటరీ తీయడం జరుగుతుందన్నారు. ఇందులో కేటాయింపులు రాని వారికి మళ్లీ జనరల్ కేటగిరీలో సదరు దరఖాస్తులను కలిపిన తరువాత లాటరీ తీస్తారని వివరించారు. లాటరీలో ప్లాట్ల కేటాయింపులు జరగని వారికి అదే రోజున ఎంఈడీని చెక్కు రూపంలో తిరిగి ఇవ్వడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులందరూ ఈ లాటరీ ప్రక్రియకు హాజరవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్లోబల్ హెల్త్ కేర్ సమ్మిట్‌కు పక్కా ఏర్పాట్లు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): సంపూర్ణ ఆరోగ్యం అనే థీమ్‌తో విశాఖలో తొలిసారిగా నిర్వహిస్తున్న గ్లోబల్ హెల్త్ సమ్మిట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నోవాటెల్ వేదికగా ఈ సమ్మిట్ జరగనుంది. అమెరికాలో స్థిరపడ్డ 100 మంది ఇండియన్ వైద్యులతోపాటు ప్రపంచ నలుమూలల నుంచి 450 మంది వైద్యులు హాజరుకానున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్‌లో మానసిక ఆరోగ్యం, ఆత్మహత్యల నివారణ, అవగాహన, శిశు, మాతాశిశు మరణాలు, పోషకాహారం వంటి అంశాలపై చర్చించనున్నారు. తొలి రోజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా పాల్గొని.. ప్రసంగిస్తారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారు. అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ ఆరిజెన్(ఏపీపీఐ) అధ్యక్షుడు డాక్టర్ రవి కొల్లి, వైఎస్సార్ హెల్త్ వర్సిటీ విశ్రాంత వీసీ డాక్టర్ టి.రవిరాజు, ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, డాక్టర్ పి.వి.సుధాకర్ సమ్మిట్ నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు.

ట్రాఫిక్ ఉల్లం'ఘనులు'

- 20 మంది వాహనాలపై వందకు పైగా ఈ–చలానాలు
- ఏపీ31డీఆర్ 0304 వాహనంపై ఏకంగా 162 కేసులు
- ఏపీ39 బీవై 0608పై రూ.47,510 జరిమానా పెండింగ్

దొండపర్తి(విశాఖ దక్షిణ): నగరానికి చెందిన కొంత మంది వాహనచోదకులు ట్రాఫిక్ ఈ–చలానాల నమోదులో రికార్డు సృష్టిస్తున్నారు. వందకు పైగా చలానాలు.. రూ.వేలల్లో జరిమానాలతో నగరంలో ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారు. ఇటువంటి వారిపై కొరడా ఝుళిపించేందుకు నగర పోలీస్ శాఖ సమాయత్తమవుతోంది. వందకు పైగా ట్రాఫిక్ ఈ–చలానాలు కలిగిన వారి జాబితాను సిద్ధం చేసింది. ఇందులో ఏపీ31డీఆర్ 0304 వాహనంపై ఏకంగా 162 ఈ–చలానాలు ఉన్నాయి. రూ.32,095 వరకు జరిమానా చెల్లించాల్సి ఉంది. అలాగే ఏపీ39 బీవై 0608పై 115 చలానాలు ఉండగా.. రూ.47,510 జరిమానా పెండింగ్‌లో ఉంది. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపే వారిపై పోలీసులు ఈ–చలానాల ద్వారా జరిమానా విధిస్తున్నారు. ఆ సమాచారం సంబంధిత వాహనచోదకుడి మొబైల్‌కు కూడా మెసేజ్ రూపంలో సమాచారం అందుతుంది. ఈ జరిమానాను ఆన్‌లైన్ ద్వారా గానీ, మీసేవా కేంద్రాలు, పేటీఎం, ఫోన్‌పే ద్వారా చెల్లించే అవకాశం ఉంటుంది. అయితే కొంత మంది వాహనచోదకులు ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతూ.. ఈ–చలానాలు పడినా చెల్లించడం లేదు. అటువంటి వారిపై పోలీసులు తాజాగా దృష్టి సారించారు. వందకుపైగా చలానాలు ఉన్న వారి వాహనాల జాబితాను సిద్ధం చేశారు. ఏపీ31ఈజే5950పై 147 చలానాలు (జరిమానా రూ.22,145), ఏపీ31ఈడీ 0856పై 145 (రూ.22,675), ఏపీ31సీక్యూ 3246పై 129(రూ.21,215), ఏపీ39 సీటీ 2087పై 126(రూ.24,365), ఏపీ35ఏఎన్ 2486పై 122(రూ.19,570), ఏపీ33ఏ 0309పై 116(రూ.23,930) ఇలా 20 మంది వాహనాలపై వందకుపైగా చలానాలు ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటికైనా జరిమానాలు కట్టని పక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

జిల్లా ఓటర్లు 18.96 లక్షలు

- కొత్తగా నమోదైన ఓటర్లలో మహిళలే అధికం
- ఓటర్ల తుది జాబితా ప్రకటించిన కలెక్టర్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): కలెక్టర్ మల్లికార్జున గురువారం ఓటర్ల తుది జాబితాను ప్రకటించారు. 2023లో ప్రచురించిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలోని 1945 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 18,96,043 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్లు 9,47,833, పురుషులు 9,48,085, 125 మంది థర్డ్‌జెండర్లు ఉన్నారు. 2022లో 18,80,773 మంది ఓటర్లు ఉండగా, అందులో 9,42,231 మంది పురుషులు, 9,38,414 మంది మహిళలు, 128 మంది థర్డ్‌జెండర్లు ఉన్నారు. తాజాగా జాబితా ప్రకారం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 15,270 మంది ఓటర్లు పెరిగారు. కొత్తగా నమోదైన ఓటర్లలో మహిళలే అధికంగా ఉన్నారు. మొత్తంగా చూసుకుంటే పురుష ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. డబుల్ ఎంట్రీ, మరణించిన వారు, వలసపోయిన 23,168 మందిని గుర్తించి జాబితా నుంచి తొలగించారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలివీ..

అసెంబ్లీ పేరు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
భీమిలి	1,62,066	1,65,532	18	3,27,616	335
తూర్పు	1,26,745	1,29,931	20	2,56,696	282
దక్షిణ	1,06,453	1,07,396	36	2,13,885	235
ఉత్తరం	1,36,161	1,37,934	19	2,74,114	271
పశ్చిమ	1,20,727	1,14,177	13	2,34,917	237
గాజువాక	1,57,055	1,53,465	18	3,10,538	305
పెందుర్తి	1,38,878	1,39,398	01	2,78,277	280

సెబ్ స్టేషన్ల పరిధి మార్పు

దొండపర్తి (విశాఖ దక్షిణ) : జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) భౌగోళిక స్వరూపం మారింది. జిల్లాల పునర్విభజన నేపథ్యంలో పలు ప్రాంతాలను వివిధ స్టేషన్లలో కలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జిల్లాలకు అనుగుణంగా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం నగరంలో సెబ్ స్టేషన్లలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ఇందులో భాగంగా నగర పరిధిలో 4 సెబ్ స్టేషన్ల స్థానంలో 3 స్టేషన్లు పనిచేయనున్నాయి. జిల్లాలో 7 స్టేషన్ల స్థానంలో 6 స్టేషన్లు అయ్యాయి. అలాగే సర్కిల్ 1, 2 3 ఫోర్‌కు బదులు ఇకపై మహారాణిపేట, సీతమ్మధార, గోపాలపట్నంగా మారాయి. సర్కిల్–1 పరిధిలో రెల్లి వీధి, హార్బర్ తదితర ప్రాంతాలు మహారాణిపేట పరిధిలోకి వచ్చాయి. అలాగే సెబ్ స్టేషన్ సర్కిల్–4 పరిధిలోని మల్కాపురం, గాజువాక, 93వ వార్డు ఆర్‌ఆర్ వెంకటాపురం పరిసర ప్రాంతాలు పెందుర్తిలో కలిశాయి. పెందుర్తి సెబ్ స్టేషన్ పరిధిలోని 92వ వార్డు గోపాలపట్నం సెబ్ స్టేషన్ పరిధిలోకి వచ్చింది. ఈ మార్పులు ఈ నెల 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చినట్లు విశాఖపట్నం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

జిల్లా ప్రధాన న్యాయ సహాయకుడిగా చంద్రశేఖర్



చంద్రశేఖర్

విశాఖ లీగల్: జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ ప్రధాన న్యాయ సహాయకుడిగా సీనియర్ న్యాయవాది యంద్ర చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ కార్యదర్శి ఎం.బబిత ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కాలంలో వివిధ కేసుల్లో ముద్దాయిలు, సివిల్ కేసుల్లో బాధితులు న్యాయ సహాయం లేని కారణంగా ఏళ్ల తరబడి న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నారు. సమస్యను గుర్తించిన జాతీయ న్యాయసేవా ప్రాధికార సంస్థ సూచనల మేరకు న్యాయస్థానాల్లో ఉచిత న్యాయ సహాయం పొందిన వారి కేసులు వాదించేందుకు సీనియర్ న్యాయవాదులను నియమించాలని నల్సా నిర్ణయించింది. ఇందులో భాగంగా అర్హులైన న్యాయవాదుల కోసం దరఖాస్తులు ఆహ్వానించి, పరీక్షలు నిర్వహించింది. ప్రతి జిల్లాకు సీనియర్ న్యాయవాదితో పాటు మరో ఇద్దరిని సహాయకులుగా నియమించింది. వీరు న్యాయ సహాయం కావాల్సిన కేసులను స్వీకరించి డిఫెన్స్ కౌన్సిల్‌గా తమ సేవలు అందిస్తారు. చంద్రశేఖర్‌తో పాటు ఎస్.శ్రీనివాస్, మజ్జి రమేష్ న్యాయ సహాయకులుగా పనిచేస్తారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక కేంద్రాన్ని జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తుల గోపి శుక్రవారం ప్రారంభిస్తారు.

జారిపడి పెయింటింగ్ కార్మికుడి మృతి

- మరో కార్మికునికి తీవ్ర గాయాలు
- జేఎన్ ఫార్మాసిటీ స్మైలెక్స్ ఔషధ పరిశ్రమలో దుర్ఘటన


పైడిరాజు(ఫైల్)


పరిశ్రమ ఎదుట ఆందోళనకు దిగిన మృతుడి కుటుంబ సభ్యులు

పరవాడ (పెందుర్తి): అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని జేఎన్ ఫార్మాసిటీలో స్మైలెక్స్ ఔషధ పరిశ్రమలో పెయింటింగ్ పనులు చేస్తుండగా జరిగిన ప్రమాదంలో గురువారం ఉదయం ఓ కార్మికుడు మృతి చెందగా మరో కార్మికుడు తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యాడు. పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... పెదగంట్యాడ మండలం అప్పికొండ దరి మురుబాయి ప్రాంతానికి చెందిన మేడిశెట్టి పైడిరాజు (36), వనం అప్పారావు (34) పరిశ్రమలో 4 నెలల నుంచి కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరు గురువారం ఉదయం విధులకు హాజరై సుమారు 20 అడుగుల ఎత్తులో రోప్‌కు అమర్చిన చెక్కపై నిలబడి పెయింటింగ్ పనులు చేస్తుండగా... రోప్ తెగిపోవడంతో కింద పడిపోయారు. పైడిరాజుకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనస్థలిలో ప్రాణాలు కోల్పోయాడు. మరో కార్మికుడు అప్పారావుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

పరిహారం చెల్లించాలని కుటుంబీకుల ఆందోళన

మృతిచెందిన కాంట్రాక్టు కార్మికుడు పైడిరాజు కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు సీఐటీయూ ఆధ్వర్యంలో పరిశ్రమ ఎదుట గురువారం రాత్రి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ మృతుని కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించి క్షతగాత్రునికి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. చర్చల అనంతరం మృతుని కుటుంబానికి రూ.30 లక్షల నష్టపరిహారం చెల్లించి, దహన ఖర్చుల నిమిత్తం రూ.50 వేలు చెల్లిస్తూ, కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించడానికి యాజమాన్యం అంగీకరించడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా క్షతగాత్రునికి వైద్య ఖర్చులు భరిస్తూ ఆస్పత్రిలో ఉన్నంత కాలం జీతం చెల్లించడానికి అంగీకారం కుదిరింది. ఈ చర్చల్లో పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, సీఐటీయూ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ, 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు, యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. పరిశ్రమ వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరవాడ సీఐ ఈశ్వరరావు, ఎస్‌ఐ మల్లేశ్వరరావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆరేళ్ల క్రితం హత్య చేసి.. ఇప్పుడు లొంగిపోయి..

- 2016లో జరిగిన హత్య కేసులో వీడిన చిక్కుముడి
- పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు
- చేసిన తప్పుకు శిక్ష అనుభవిస్తున్నానని వెల్లడి


లక్ష్మి (ఫైల్)

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరేళ్ల క్రితం జరిగిన ఓ హత్య కేసు ఓ కొలిక్కి వచ్చింది. నిందితుడే స్వయంగా పోలీసులకు లొంగిపోవడంతో పోలీసులకు పని సులువైంది. నిందితుడిని పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఆరిలోవ సీఐ ఇమాన్యుయేల్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరిలోవ ప్రాంతానికి చెందిన దాడి లక్ష్మి(48) 2016 ఏప్రిల్ 7 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త దాడి నాగేశ్వరరావు అదే నెల 9న ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అదే నెల 11న ముడసర్లోవ రిజర్వాయర్‌లో గుర్తు తెలియని మృతదేహం ఒడ్డుకు కొట్టుకువచ్చింది. ఆ మృతదేహం మిస్సింగ్ అయిన దాడి లక్ష్మిదిగా ఆమె భర్త గుర్తించాడు. ఆమె కాళ్ల, చేతులు కట్టేసి ఉన్నాయి. దీంతో పాటు గోనె సంచికి పెద్ద రాయి కట్టి ఉండటంతో పోలీసులు అప్పట్లో అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సరైన ఆధారాలు లభించకపోవడంతో కొన్నాళ్ల తర్వాత ఆ కేసును పెండింగ్‌లో పెట్టారు. ఇదిలా ఉండగా ఈనెల 4న దాడి లక్ష్మిని 2016 ఏప్రిల్ 7న తానే హత్య చేశానంటూ గోపాలపట్నం ప్రాంతానికి చెందిన దాసరి దిల్లీశ్వరరావు ఆరిలోవ పోలీసులకు తెలియజేశాడు. దీంతో పోలీసులు అతడి నుంచి వివరాలు సేకరించి గురువారం కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఏటీఎంలో డబ్బులు తీయించి.. తరువాత హత్య...

దిల్లీశ్వరరావు రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి. రిటైర్డ్ అయిన తర్వాత ఆయన నగరంలో ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేశాడు. అక్కడ ఉన్న క్యాంటీన్‌లో దాడి లక్ష్మి వంట మనిషిగా పనిచేసేది. వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. దిల్లీశ్వరరావు 2016లో హౌసింగ్ లోన్ తీసుకొని గోపాలపట్నంలో ఇల్లు కొన్నాడు. ఇల్లు కొనగా మిగిలిన మరికొంత నగదు అతని భార్య బ్యాంక్ ఖాతాలో ఉంది. డబ్బులు అవసరమై అడిగితే ఆమె ఇవ్వలేదు. దీంతో ఆమె బ్యాంక్ ఏటీఎం కార్డు తీసుకొచ్చి లక్ష్మితో ఏటీఎంలో అవసరమైన డబ్బులు విత్‌డ్రా చేయించాడు. ఆ విషయమై దిల్లీశ్వరరావును అతని భార్య నిలదీసింది. అంతటితో ఆగకుండా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆమె ఏటీఎం కార్డు ఉపయోగించి ఓ మహిళ డబ్బులు విత్‌డ్రా చేసినట్లు సీసీ కెమెరాలలో వెల్లడైంది. దీంతో లక్ష్మితో ఉన్న సంబంధం బయటపడిపోతుందనే భయంతో ఆమెను అంతం చేయాలనుకున్నాడు. అందుకు తగిన ప్లాన్ వేసుకున్నాడు. 2016 ఏప్రిల్ 7న రాత్రి లక్ష్మిని బైక్‌పై ఎక్కించుకొని ముడసర్లోవ ప్రాంతానికి తీసుకెళ్లాడు. బీఆర్‌టీఎస్ పక్కన సింహాచలం కొండ అంచున ఆమె మెడ గట్టిగా పట్టి చంపేశాడు. కాళ్లు చేతులు కట్టేసి మృతదేహాన్ని ఓ గోనె సంచిలో పెట్టాడు. మృతదేహం తేలకుండా గోనె సంచికి పెద్ద రాయిని తాడుతో కట్టి ముడసర్లోవ రిజర్వాయర్‌లో పడేశాడు. ఇదంతా ఆయన స్వయంగా వచ్చి లొంగిపోయి వివరించడంతో పోలీసులు అవాక్కయ్యారు. దీని ప్రకారం దిల్లీశ్వరరావును కోర్టులో హాజరుపరిచి అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. తాను చేసిన పాపానికి తగిన శిక్ష అనుభవిస్తున్నానని, తన భార్య, పిల్లలు తనకు దూరంగా ఉండంతో తాను ఒంటరయ్యానని పోలీసులకు తెలియజేశాడు. ఇటీవల తన కుమార్తె వివాహం కూడా తనకు తెలియకుండా జరిపించారని పేర్కొన్నాడు. పశ్చాత్తాపంతో చేసిన నేరం అంగీకరిస్తున్నట్లు తెలిపాడు.

'నాడు-నేడు'తో విద్యారంగంలో ఉన్నత ప్రమాణాలు

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున


శ్రీకాకుళం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి నాగార్జున

మహారాణిపేట: నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ కళాశాలలకు నూతన భవనాలతో పాటు అనేక మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. ఈ పథకం వల్ల విద్యారంగంలో ప్రమాణాలు పెరిగాయన్నారు. ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ఎస్సీ కార్పొరేషన్, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో విద్య, మధ్యాహ్న భోజనం, వసతి తదితర అంశాలపై అధికారులతో చర్చించి.. పకడ్బందీగా అమలుకు స్పష్టమైన ఆదేశాలిచ్చామన్నారు. విద్యార్థులు ఆయా సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు శ్రీకాకుళం జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమణమూర్తి, శ్రీకాకుళం సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గెడ్డమ్మ, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామారావు, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, జిల్లా కో-ఆర్డినేటర్ పాల్గొన్నారు.

నేడు టౌన్‌ప్లానింగ్ స్పందన

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి శుక్రవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కమిషనర్ పి.రాజాబాబు ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ ప్రణాళికా విభాగంపై అధికంగా వస్తున్న ఫిర్యాదుల దృష్ట్యా ప్రతి శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీవీఎంసీ సమావేశ మందిరంలో నిర్వహించనున్న స్పందనను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

సముచిత స్థానం కల్పించిన పార్టీకే మద్దతు

ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిశేషు


మాట్లాడుతున్న ఆదిశేషు

బీచ్ రోడ్డు(విశాఖ తూర్పు): వచ్చే ఎన్నికల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించిన పార్టీకే బీసీల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిశేషు స్పష్టం చేశారు. బీసీల జాగృతి-సాధికారత అంశంపై గురువారం నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు రాజకీయ ప్రాధాన్యం కూడా మరింత పెరగాలన్నారు. బీసీల వెనుకబాటుకు గల కారణాలపై రాష్ట్ర స్థాయిలో విస్తృత చర్చ సాగుతోందని చెప్పారు. వెనక బడిన కులాల ప్రగతికి సమన్వయంతో ముందుకు సాగితే అద్భుత ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కమిషనర్ టి.శివశంకర్, జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘు, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రకృతి పంటల ప్రదర్శన

- గాదిరాజు ప్యాలస్ వేదికగా ఆర్గానిక్ మేళా-2023
- సేంద్రియ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సదస్సులు


మేళా వేదిక ముఖద్వారం

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): ఆర్గానిక్ మేళా-2023 ద్వారా ప్రకృతి పంటల ప్రదర్శనకు రంగం సిద్ధమైంది. గాదిరాజు ప్యాలస్ వేదికగా శుక్రవారం నుంచి ప్రకృతి సేద్యంపై అవగాహనతో పాటు పంటల ప్రదర్శన, ఉత్పత్తుల విక్రయాలు చేపట్టేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు విశాఖ ఆర్గానిక్ మేళా-2021 జరగనుంది. ప్రకృతి ఆధారిత పంటలు, ఉత్పత్తులు, ఔషధ మొక్కలు, పక్షుల గూళ్లు పెట్టే మొక్కలు, పువ్వులు, పండ్ల జాతి మొక్కలు, వివిధ రకాల విత్తనాల ప్రదర్శనతో పాటు విక్రయాలు నిర్వహించనున్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు ఉత్పత్తుల అమ్మకాల ద్వారా రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. మేళా ఏర్పాట్లను భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, మేళా గౌరవ అధ్యక్షుడు జీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ జీవీఎస్ఎన్ రాజు, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త అశోక్‌కుమార్, రైతు మిత్రా టెర్రస్ గార్డెన్ నిర్వాహకుడు దాట్ల వర్మ, గ్రీన్ క్లైమేట్ అధ్యక్షుడు జేవీ రత్నం, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి షణ్ముఖరావు తదితరులు పర్యవేక్షించారు.

మేళా నిర్వహణ ఇలా..

3వ విశాఖ ఆర్గానిక్ మేళా తొలిరోజు ప్రారంభ కార్యక్రమంలో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయమంత్రి మురళీధరన్, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ మల్లికార్జున ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారు. ప్రారంభం కార్యక్రమం అనంతరం రైతు సమ్మేళనం జరగనుంది. 7న మిద్దెతోట, 8న గో ఆధారిత ఉత్పత్తుల తయారీపై శిక్షణ, 9న ఆరోగ్యమే మహాభాగ్యం అంశంపై సదస్సు నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాల్లో సేంద్రియ వ్యవసాయంలో నిష్ణాతులైన రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు సంస్థ ప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొనున్నారు.

ప్లాట్‌ఫాం ఎత్తు పెంపు పరిశీలిస్తాం

- డీఆర్ఎం అనూప్‌కుమార్
- దువ్వాడ రైల్వేస్టేషన్ తనిఖీ


రైల్వేస్టేషన్‌లో వసతులు పరిశీలిస్తున్న డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి

అగనంపూడి (గాజువాక): దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం ఎత్తు పెంచేందుకు గల అవకాశాలు పరిశీలిస్తామని వాల్తేరు డివిజన్ డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి తెలిపారు. ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ పరిధిలో వరుస ప్రమాదాలు సంభవించిన నేపథ్యంలో అధికారులతో కలసి ఆయన గురువారం సాయంత్రం దువ్వాడ రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్లాట్‌ఫామ్‌లు, విశ్రాంతి గదులు, కార్యాలయం, ఫుట్ ఓవర్ వంతెన, నీటి సదుపాయం, నీటి పారుదల వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ రైల్వేస్టేషన్ల స్థాయి పెంపుదలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, అందులో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్ స్థాయి పెంచడంతో పాటు ఆధునికీకరణ పనులు చేపట్టనున్నామని తెలిపారు. ఫుట్ ఓవర్ వంతెన వద్ద ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. అనంతరం ప్లాట్‌ఫాం భద్రతపై సిబ్బందితో కలిసి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో సమస్యలపై దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కాటం ఎస్.ఎస్.చంద్రరావు, వి.జాషువా తదితరులు డీఆర్ఎంకు వినతిపత్రం సమర్పించారు.

ప్రయాణికులతో మాటామంతి : విశాఖ నుంచి దువ్వాడ వరకు విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన డీఆర్ఎం ప్రయాణికులతో ముచ్చటించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్ పి.కె.మహారాణా, సీనియర్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి, సీనియర్ డివిజనల్ సిగ్నల్, టెలికాం ఇంజినీర్ దీప్తాన్ష్ శర్మ, సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ సీహెచ్. రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

- 18 రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 800 మంది క్రీడాకారులు
- 8వ తేదీ వరకు పోటీలు


సబ్ జూనియర్ విజేతలకు బహుమతుల ప్రదానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో 27వ జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ సహకారంతో జాతీయ పవర్ లిఫ్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8 వరకు పోటీలు నిర్వహించనున్నారు. జాతీయ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్‌నాథ్ సింగ్, లియో పీటర్, నేషనల్ అఫీషియల్ అండిబోయిన లక్ష్మీదేవి, ఏపీ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.భాస్కరరావు, అండిబోయిన అప్పారావు ఈ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్ అంశాల్లో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్, మాస్టర్ 1,2,3 మెన్ అండ్ ఉమెన్ కేటగిరీల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. 18 రాష్ట్రాల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. రోజూ ఒక్కో కేటగిరిలో అత్యధిక లిఫ్ట్ చేసిన వారికి స్ట్రాంగ్‌మన్ టైటిల్ అందజేస్తారు. సాయంత్రం స్టీల్‌ప్లాంట్ గుర్తింపు యూనియన్ నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, ఆంధ్రకేసరి కళాక్షేత్రం కార్యదర్శి సిహెచ్.వి. సత్యనారాయణ, టి.సత్యనారాయణ, కె.వి. భాస్కర్, జోగారావు, ఈశ్వరరావు సబ్ జూనియర్ కేటగిరీ విజేతలకు బహుమతులు అందజేశారు.

మరికొన్ని ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సంక్రాంతి పండగ దృష్ట్యా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు ఆయా మార్గాలలో పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు.

- తాంబరం-న్యూటిన్‌సుకియా(06073) స్పెషల్ ఈనెల 8న తాంబరంలో ఉదయం 10.45 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 11.45 గంటలకు విశాఖపట్నం చేరుకుని, ఇక్కడి నుంచి 9వ తేదీ సోమవారం రాత్రి 12.05 గంటలకు బయల్దేరి మంగళవారం 10వ తేదీ రాత్రి 7.35 గంటలకు న్యూటిన్‌సుకియా చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో న్యూటిన్‌సుకియా-తాంబరం (06074) స్పెషల్ ఈ నెల 11న రాత్రి 8.20 గంటలకు న్యూటిన్‌సుకియాలో బయల్దేరి 13వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 3.50 గంటలకు బయల్దేరి శనివారం తెల్లవారుజామున 5.45 గంటలకు తాంబరం చేరుకుంటుంది.
- టాటా-మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు(08885) స్పెషల్ టాటాలో ఈ నెల 6న ఉదయం 4.50 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 8 గంటలకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు చేరుకుంటుంది.
- హతియా-మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు(08887) స్పెషల్ హతియాలో ఈనెల 7న ఉదయం 4.50 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 8.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 8 గంటలకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరు చేరుకుంటుంది.

క్రీడలతో మానసిక వికాసం

ఇంటర్ పాలిటెక్నిక్ రీజినల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం


ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రబాబు

మురళీనగర్ (విశాఖ ఉత్తర): క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ జీవీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ పాలిటెక్నిక్ రీజినల్ స్పోర్ట్స్ మీట్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతోపాటు ప్రతి విద్యార్థి తనకు నచ్చిన క్రీడలో ప్రవేశం కలిగి వుండాలని సూచించారు. దీని వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం, శారీరక దారుఢ్యం పెరుగుతుందని, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్యాభ్యాసానికి రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఉద్యోగాలు పొందవచ్చని వివరించారు. ముందుగా ఎమ్మెల్సీ రవీంద్రబాబు వాలీబాల్ క్రీడను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ రవీంద్రబాబుతోపాటు బి.రఘునాథరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, కేడీవీ నరసింహారావు, కె.మధుకుమార్, హరిబాబు, జె.రాజేంద్రప్రసాద్, కె.రత్నకుమార్, గోవర్ధనరావు, పీఎం బాషా, రాష్ట్ర ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, స్థానిక పీడీ అబ్బాస్ బేగ్ పాల్గొన్నారు.

సింహగిరిపై నృసింహ దీక్షల విరమణ

- అధిక సంఖ్యలో తరలివచ్చిన దీక్షధారులు
- అప్పన్నకు తిరుముడుల సమర్పణ
- శోభాయమానంగా శాంతికల్యాణం


తిరుముళ్లతో సింహగిరికి తరలివస్తున్న దీక్షాధారులు

సింహాచలం: సింహగిరిపై నృసింహ దీక్షల విరమణ కార్యక్రమాన్ని గురువారం శాస్త్రోక్తంగా జరిపించారు. 41 రోజుల మండల దీక్ష , 32 రోజుల దీక్ష చేసిన దీక్షాధారులంతా శిరసుపై తిరుముడులను పెట్టుకుని మెట్లమార్గంలో, ఘాట్‌రోడ్డులో సింహగిరికి తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి వాటిని సమర్పించి, దీక్ష విరమణ చేశారు.

ఘనంగా నృసింహ హోమం : తొలుత సింహగిరికి తరలివచ్చిన దీక్షాధారులంతా తిరుముళ్లతో స్వామివారి అంతరాలయ దర్శనం చేసుకున్నారు. అనంతరం దేవస్థానం వైదికులు దీక్షాధారులందరిచేత శాస్త్రోక్తంగా దీక్షా విరమణ చేయించారు. ఈ సందర్భంగా నృసింహ హోమం నిర్వహించారు. మహా పూర్ణాహుతి సమర్పించారు. కుంభప్రోక్షణ విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చి, శాంతి కల్యాణాన్ని శోభాయమానంగా జరిపించారు. భక్తులకు స్వామివారి అక్షింతలు అందజేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఏఈవో నరసింహరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. దీక్ష విరమించిన వారిలో సింహాచలానికి చెందిన చందన పెరుమాళ్ల పీఠం గురుస్వామి సానబోయిన రాజు ఉన్నారు.

మిస్ అండ్ మిసెస్ ఇండియా క్వీన్ ఆఫ్ ఆర్ట్‌గా విశాఖ మహిళ


చిన్నిపిల్లి గాయత్రి

మధురవాడ(భీమిలి): మిస్ అండ్ మిసెస్ ఇండియా క్వీన్ ఆఫ్ ఆర్ట్స్-2022గా తెలుగు మహిళ, వాల్తేరుకు చెందిన చిన్నిపిల్లి గాయత్రి సాధించింది. అలాగే బ్యూటీ విత్ బ్రెయిన్స్ అవార్డును కూడా సొంతం చేసుకుంది. ఢిల్లీ వేదికగా ఎయిరో లామ్, ఫ్లెక్స్‌బాండ్ ఆధ్వర్యంలో గత డిసెంబర్ 22న ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 200 మంది పాల్గొన్నారు. వీరిలో 50 మందిని తుది పోటీలకు ఎంపిక చేయగా.. అందులో గాయత్రి క్వీన్ ఆఫ్ ఆర్ట్స్‌గా విజయం సాధించింది.

DEBTS RECOVERY TRIBUNAL VISAKHAPATNAM
31-31-21, Ground & 1st Floor, Sri Narayana Bhavanam, Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020, Andhra Pradesh.

Case No: OA 550/2022

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993.

Union Bank of India, Seethammadhara Branch, Visakhapatnam-523247
VS
M/s Hai Greeva Infra Tech Projects Limited, Sri Chilukuri Jagadeeswarudu, Visakhapatnam-530040

To:
Defendant-5: Y.S.V.V. Prasada Rao, 45-35-10/A, Jagannadhapuram, Visakhapatnam.
Defendant-6: Mrs. Y. Ramanamma, D.No:45-35-10/A, Jagannadhapuram, Visakhapatnam.
Defendant-10: Sri A. Vara Prasad, Plot No: 117, D.No: 1-83-3, Visakhapatnam, Sai Satya Residency, Chinna Waltair, Visakhapatnam.
Defendant-11: Mr. S. Suresh Kumar, Sai Satya Residency, Chinna Waltair, Visakhapatnam.

PAPER PUBLICATION

Whereas, OA550/2022 was listed before Hon'ble Presiding Officer/Registrar on **24/01/2023.**

WHEREAS this Hon'ble Tribunal is pleased to issue summons / notice on the said Application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of **Rs.28,81,86,010/-** (application along with copies of documents etc. annexed).

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:-.

(i) to show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted;
(ii) to disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application;
(iii) you are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties:
(iv) you shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/ or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) you shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.

You are also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before Presiding Officer / Registrar on 24/01/2023 at 10:30 A.M. failing the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this date 26-12-2022.

Signature of Officer Authorized to issue PAPER PUBLICATION
Debts Recovery Tribunal, Visakhapatnam